# సౌందర్యలహరి

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ప్రవచనం

ఎమెస్కో

# సౌందర్యలహరి

**ఆదిశంకరులు**

ఒకనాడు పరమశివుడు దక్షిణామూర్తిగా వచ్చారు.

**చిత్రం వట తరుర్మూలే వృద్ధాః శిష్యా గురూర్యువా**
**గురోస్తు మౌనం వ్యాఖ్యానం శిష్యోస్తు ఛిన్న సంశయః॥**

వారు మౌనంగా కూర్చుని, తనను బ్రహ్మజ్ఞానంకోసమని ఆశ్రయించిన సనక సనందనాది మహర్షులందరికీ కేవలం మౌనంతోటి వారి సంశయాలన్నింటినీ పోగొట్టి, బ్రహ్మజ్ఞానం కటాక్షించారు. అటువంటి సదాశివుడే ఒకనాడు ఆది శంకరులుగా అవతరించారు. ఒకనాడు వేదప్రమాణం ప్రశ్నింపబడితే, ఒక ఆడలేడి పదిహేను వేటకుక్కల మధ్యలో నిలబడిపోయినపుడు కన్నీరు కారుస్తూ ఎంత ఆర్తితో చూస్తుందో, అటువంటి పరిస్థితి ఈ దేశంలో ఉత్పన్నమయితే, మహానుభావుడు కైలాస శంకరుడు ఆదిశంకరుడిగా అవతరించి భారతదేశపు నలుచెరగులా పాదచారియై పర్యటించి వేదప్రమాణాన్ని ప్రశ్నించిన అనేకవాదాలను ఖండించి, మరల వేదాంతర్గతమయిన అద్వైత సిద్ధాంత వ్యాప్తిచేసి అహం బ్రహ్మాస్మి స్థాయికి ఎదిగిన మహాపురుషుడు. వారికి ఏమి అవసరం? వారు 'పశూనాం సర్వజ్ఞ ప్రథితకృపయా పాలయవిభో' అనవలసిన మనిషా శంకరభగవత్పాదులు? ఆయన –

**'దృశా ద్రాఘీయస్యా దరదలిత నీలోత్పలరుచా**
**దనీయాంసం దీనం స్నపయ కృపయా మా మపి శివే!'**

అంటారు సౌందర్యలహరిలో. 'అమ్మా, నీ కరుణార్ద్రపూరితమైన చూపులతో నన్ను తడిపివేయమ్మా' అంటారు. శంకరులెందుకు ఆ మాట అనడం? బ్రహ్మ జ్ఞానియై

నిరంతరజ్ఞానంచేత ఆత్మస్థితిలో రమించే మహాపురుషుడు ఆ మాట అనడమెందుకు? అంటే మనకోసమని మరొకమెట్టు క్రిందికిదిగి 'నేను ఆ మాట అనకపోతే వీరందరికీ ఎవరు దారి చూపుతారు?' అని, ఒకనాడు మౌనంగా కూర్చున్న సదాశివుడే నోరువిప్పి వ్యాఖ్యానం చేసిన శంకరులై వచ్చారు. ఒకనాడు కదలకుండా దక్షిణాభిముఖుడై కూర్చున్న సదాశివుడే ఆసేతుహిమాచలపర్యంతమూ పర్యటించిన శంకరుడై వచ్చారు.

## శ్రీఆదిశంకరులు

ఒకనాడు అమ్మవారు పక్కనలేకుండా కూర్చున్న సదాశివుడే – 'మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవ' అనికదా – లోపల తనలోతాను రమించిపోయే నిర్గుణ పరబ్రహ్మస్వరూపం పొందిన సదాశివుడు, అమ్మవారి శక్తి తనలో కలవడం వలన ఆ మాతృదేవోభవ పితృదేవోభవ రెండూకలిసి ఆచార్యదేవోభవగా, శంకరభగవత్పాదులుగా పార్వతీపరమేశ్వరుల ఏకత్వం పొందిన స్వరూపం ఈ భూమి మీద నడయాడింది. ముప్పయిరెండు సంవత్సరాలు మాత్రమే ఈ పాంచ భౌతికశరీరంతో ఉన్న శంకరులు ఆ నాడు ఆవిష్కరించిన ప్రజ్ఞచేత వేదప్రమాణం నిలబడి, వేదానికి వ్యతిరేకమయిన వాదాలు ఈ దేశంలో ప్రవేశిస్తాయేమోనని భారతదేశం నాలుగు చెరగులా నాలుగు పీఠాలనుపెట్టి కాపు పెట్టారు.

| | | |
|---|---|---|
| గోవర్ధనపీఠం | – | జగన్నాథ్ |
| కాళికాపీఠం | – | ద్వారక |
| జ్యోతిపీఠం | – | బదరికాశ్రమం |
| శారదాపీఠం | – | శృంగగిరి |

తూర్పున జగన్నాథ్‌లో గోవర్ధనపీఠం, పడమర ద్వారకలో కాళికాపీఠం, ఉత్తరాన బదరికాశ్రమంలో జ్యోతిపీఠం, దక్షిణాన శృంగగిరిలో శారదాపీఠం – ఈ నాలుగు పీఠాలనుపెట్టి, వేదవ్యతిరేకమయిన వాదాలు మరల భారతగడ్డమీదకి రాకుండా కాపుపెట్టిన మహనీయులు శంకరులు. ఆ నాటినుంచి ఈ నాటివరకు వారు పెట్టిన ఆమ్నాయసంప్రదాయాలతో ఆ పీఠాలు నడుస్తూనే ఉన్నాయి. ఇది శంకరులు భారతజాతికి చేసిన అపారమయిన సేవ. దానికి ఏమి ఇచ్చి మనం ఋణం తీర్చుకోగలం? అనంతమయి అంతటా నిండిపోయిన గురువుకి పంచెలచాపు నేయగల సాలెవాడు ఇంకా ఈ భారతదేశంలో పుట్టలేదు. అందుకని రెండుచేతులూ ఎత్తి నమస్కరించడం తప్ప మనమేమీ చెయ్యలేము.

**జలజాతేక్షణు దోడితెచ్చితివి నా సందేశముం జెప్పి నన్**
**నిలువంబెట్టితి; నీ కృపం బ్రదికితిన్; నీయంత పుణ్యాత్మకుల్**
**గలరే? దీనికి నీకు బ్రత్యుపకృతిన్ గావింప నే నేర; నం**
**జలి గావించెద; భూసురాన్వయమణీ! సద్బంధుచింతామణీ!**

(భాగవతం – దశమస్కంధం–పూర్వభాగం– 1736)

అంటుంది రుక్మిణీదేవి. 'నీకు నేనేం చేయగలను? అందుకని రెండు చేతులూ మోడ్చి నీకు నమస్కరిస్తున్నాను' అంటుంది.

గురువుల పాదాలను స్మరించి నమస్కరించే పరమపవిత్రమయిన రోజు ఆషాఢపూర్ణిమ. ఆ రోజునే గురువులకు సంబంధించిన ఉత్సవాల రోజుగా మార్చారు. గురువులదంతా త్యాగమే. భారతీయసంప్రదాయంలో అందుకే గురువుకి అంత పెద్దపీట. ఇది ఇతరసంప్రదాయాలలో ఇతరమయిన రీతులలో ఎక్కడా కనపడదు. గురువు లేకపోతే ఏదీ భాసించదు. గురువు అనేది అంత గొప్ప తత్త్వం. అటువంటి గురువులకు సంబంధించి ఆషాఢమాసంలోని గురుపూర్ణిమరోజున అసురసంధ్యవేళలో సౌందర్యలహరివంటి మహోత్కృష్టవిషయం మీద తొమ్మిదిరోజులపాటు ఈ ప్రవచన కార్యక్రమం జరిగింది. అమ్మగురించి నాలుగు మాటలు చెప్పుకున్నా, చదువుకున్నా చాలు.

శ్రీగుణరత్నకోశంలో పరాశరభట్టర్ –

**స్తోతారం తముశంతి దేవి కవయో యో విస్తృనీతే గుణాన్**
**స్తోతవ్యస్య తతశ్చతే స్తుతిధురా మయ్యేవ విశ్రామ్యతి**
**యస్మాదస్మదమర్షణీయ ఫణితి స్వీకారతస్తే గుణాః**
**క్షాంత్యౌదార్యదయాదయో భగవతి స్వాం ప్రస్తువీరాన్ ప్రథాన్**

(శ్రీగుణరత్నకోశం – 6)

'అమ్మా, నేను చేతకానివాడిని. నాలుగుమాటలు చెపితే వాటిలో నీ ఓర్పు, దయ బయటకు వచ్చాయమ్మా. నాలుగు ముఖాలున్న బ్రహ్మగారు నిన్ను స్తోత్రం చేయలేకపోయారు. నేనా నిన్ను స్తోత్రం చేయగలవాడిని?' అంటారు. అంతటి పరమ పావనమయిన సౌందర్యలహరిని మనకు ఇచ్చిన మహాపురుషుడు శంకరులు.

## సౌందర్యలహరి భారతదేశంలో ఎలావచ్చింది?

సౌందర్యలహరి భారతదేశంలో ఎలావచ్చిందన్నదానిమీద, మార్కండేయ సంహితలో శంకరానందగిరి రాసిన శంకరభాష్యాలలో శంకరుల జీవితచరిత్రలో కొన్ని ఘట్టాలు మనకు ప్రస్తావన చేయబడ్డాయి.

ఆదిశంకరులు ఒకనాడు పార్వతీపరమేశ్వరుల దర్శనం కొఱకు కైలాస పర్వతానికి వెళ్లారు. సాక్షాత్తు పరమశివావతారమయిన శంకరులు మళ్లా శంకరుల దర్శనానికి వెళ్లడమేమిటని మీకు సందేహం కలగవచ్చు. అంటే మీరు రామాయణం బాలకాండను ఒకసారి పరిశీలించండి. రామచంద్రమూర్తి సాక్షాత్తుగా శ్రీమహావిష్ణువు అంశ. వాల్మీకి మహర్షి బాలకాండలో అంటారు –

**ఏతస్మిన్నంతరే విష్ణుః ఉపయాతో మహాద్యుతిః ।**
**శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః ॥**

(శ్రీరామాయణం – బాల– 15 – 16)

అటువంటి విష్ణువు అవతారమే పరశురాముడు. రామావతారం, పరశు రామావతారం కలుసుకున్నాయికదా! భాగవతంలో కృష్ణుడు, బలరాముడు విష్ణ్వంశతో ఒకే సమయంలో భూమి మీద నడయాడారు కదా! అందుకని పరమేశ్వరుని రీతి మనం ప్రశ్నించవలసిందిగా ఉండదు. ఒక గురుస్వరూపంతో వచ్చిన పరమశివుని అంశ శంకరభగవత్పాదులు. ఆయన కైలాసపర్వతం మీద ఉండే పార్వతీపరమేశ్వరుల దర్శనం కోసమని వెళ్ళారు. అపుడు పరమశివుడు వారికి ఆయిదు ఆత్మలింగాలను ప్రసాదించారు. అవే ఇప్పటికీ శృంగేరీపీఠంలో, కంచిపీఠంలో, కేదార్‌లో, నాల్గవది నేపాల్‌లోని నీలకంఠేశ్వరాలయంలో, అయిదవది చిదంబరంలో ఉన్నాయి. ఈ అయిదు లింగాలూ కూడా శంకరభగవత్పాదులు భూమి మీదికి తీసుకువచ్చి ఈ అయిదుచోట్ల ప్రతిష్ఠించారు. ఈ విషయం పరమయథార్థమని, నడిచే దేవుడని ప్రఖ్యాతిగాంచిన చంద్రశేఖరపరమాచార్య స్వామివారు కూడా ఉటంకించారు. అదే సమయంలో పరమశివుడు అయిదు లింగాలనిస్తే, అమ్మవారు సౌందర్యలహరి గ్రంథాన్ని శంకరభగవత్పాదులకిచ్చింది. ఇది మార్కండేయ సంహితాంతర్గతమయిన విషయం. మహాపురుషులయిన శ్రీచంద్రశేఖర పరమాచార్యస్వామివారుకూడా అంగీకరించి వ్యాఖ్యానించిన విషయం.

అపుడు శంకరులు ఆ అయిదు స్ఫటికలింగాలనూ, సౌందర్యలహరినీ తీసుకుని వస్తున్నారు. వస్తున్న సమయంలో నందికేశ్వరుడు ఎదురువచ్చి అపారమయిన పాపం